నిరుద్యోగ యువకుని ఆత్మహత్య

గ్రూప్-2 వాయిదాతో ఉద్యోగం రాదని..



ప్రజాశక్తి - హైదరాబాద్

గ్రూప్-2 పరీక్షలు వాయిదా పడడంతో ఉద్యోగం రాదనే మనస్తాపం చెంది ఓ యువకుడు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన మహబూబాబాద్ జిల్లా తొర్రూర్ రూరల్ మండలం హచ్యుతాండ గ్రామపంచాయతీ పరిధిలోని బొత్తల తండాలో చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గుగులోత్ యాకోబు-బుజ్జిల కుమారుడు రాజకుమార్ (26) ప్రభుత్వ పోటీ పరీక్షలకు ప్రిపేర్ అయ్యాడు. రాజకుమార్ మండల పరిధిలోని శారద స్కూల్లో పదో తరగతిలో 10/10, ఇంటర్‌లో 989 మార్కులు, బీటెక్ సివిల్ ఇంజినీర్‌లో 85% సాధించాడు. 2020 నుంచి ఫ్రెండ్స్‌తో ఉంటూ ఎఇఇ, గ్రూప్-2, మరియు 4కు ప్రిపేర్ అయ్యాడు. ఎఇఇ పేపర్ లీకేజ్ కావడం, గ్రూప్-2 పరీక్ష వాయిదా పడటంతో ఇన్ని సంవత్సరాలు ప్రిపేర్ అయినా ఉద్యోగం వస్తుందో రాదోనని ఆందోళనకు గురయ్యాడు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకున్నాడు. తమ కొడుకు మృతికి ప్రభుత్వమే కారణమని తండ్రి యాకోబు ఆవేదన వ్యక్తం చేశాడు.

గ్రూప్-3 దరఖాస్తుల సవరణకు అవకాశం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో గ్రూప్-3 దరఖాస్తుల్లో సవరణలకు తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టిఎస్‌పిఎస్‌సి) అవకాశం కల్పించింది. ఈ నెల 16 నుంచి 21వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తులను సవరణ చేసుకోవచ్చని టిఎస్‌పిఎస్‌సి కార్యదర్శి అనితా రామచంద్రన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒక అభ్యర్థి ఒకసారి మాత్రమే సవరణ చేసుకోవాలని సూచించారు.

డిప్రెషన్‌లో ఉన్న పిల్లలకు ప్రత్యేక హెల్ప్ లైన్

జస్టిస్ అభినంద్ కుమార్ షావలి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

డిప్రెషన్‌లో ఉన్న పిల్లల కోసం ప్రత్యేక హెల్ప్‌లైన్ ఏర్పాటు చేయాలని హైకోర్టు న్యాయమూర్తి, తెలంగాణ జుడీషియల్ అకాడమీ అధ్యక్షులు జస్టిస్ అభినంద్ కుమార్ షావలి సూచించారు. సోమవారం సికింద్రాబాద్‌లో తెలంగాణ స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ తెలంగాణ స్టేట్ జుడీషియల్ అకాడమీ సంయుక్తాధ్వర్యంలో నిర్వహించిన ఒక రోజు రిఫ్రెషర్ ట్రైనింగ్ ప్రోగ్రామ్‌లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలు, నివాస ప్రాంతాల్లో క్రీడా మైదానాలకు ప్రాధాన్యతనివ్వాలని కోరారు. పిల్లలకు విద్యతోపాటు నైతిక విలువలను బోధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ పి.శ్యామ్ కోషి, జస్టిస్ టి.వినోద్ కుమార్, తెలంగాణ స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ సభ్య కార్యదర్శి ఎస్.గోవర్ధన్ రెడ్డి, జుడీషియల్ అకాడమీ డిప్యూటీ డైరెక్టర్ ఎన్.వెంకట్ రామ్, మహిళా, శిశు సంక్షేమ శాఖ కమిషనర్ భారతి హెూళీకేరి తదితరులు పాల్గొన్నారు.

బిజెఆర్ 4 టెట్ 14.8.2023

టెట్‌కు 2.23 లక్షల దరఖాస్తులు

ఆన్‌లైన్‌లో సమర్పణకు రేపటి వరకే గడువు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)కు ఇప్పటి వరకు 2,23,811 దరఖాస్తులొచ్చాయి. ఈ మేరకు ఎన్‌సిఇఆర్‌టి డైరెక్టర్, టెట్ కన్వీనర్ ఎం రాధారెడ్డి సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇప్పటి వరకు 2,32,231 మంది ఫీజు చెల్లించారని తెలిపారు. వారిలో పేపర్-1కు 68,062 మంది, పేపర్-2కు 12,815 మంది, రెండింటికీ కలిపి 1,42,934 మంది కలిపి 2,23,934 మంది దరఖాస్తు చేశారని వివరించారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తుల సమర్పణకు తుది గడువు బుధవారంతో ముగియనుంది.

రూ.99,999 వరకూ ఉన్న

రైతు రుణాలు మాఫీ..

- ఆర్థికశాఖకు సిఎం ఆదేశాలు: జిఓ జారీ
- పంద్రాగస్టు వేళ అన్నదాతకు సర్కారు తీపి కబురు
- 10,79,721 మంది రైతులకు లబ్ధి
- మొత్తం రూ.6,546.05 కోట్లు విడుదల



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

స్వాతంత్ర్య దినోత్సవ వేళ రైతాంగానికి ప్రభుత్వం మరో తీపి కబురును అందించింది. అన్నదాతలను రుణ విముక్తులను చేసేందుకు వీలుగా మరో దఫా రుణమాఫీకి నిధులను విడుదల చేయాలంటూ సిఎం కెసిఆర్ ఆర్థికశాఖను ఆదేశించారు. రూ.99,999 వరకూ ఉన్న రుణాలను రైతుల తరపున బ్యాంకులకు చెల్లించాలని ఆయన సూచించారు. ఈ మేరకు ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావుకు సోమవారం ఆదేశాలు జారీచేశారు. రైతుల తరపున బ్యాంకులకు డబ్బు మొత్తాన్ని తక్షణమే జమ చేయాలని తెలిపారు. దీంతో సోమవారం 10,79,721 మంది రైతులకు సంబంధించి మొత్తం రూ.6,546.05 కోట్లను ప్రభుత్వం విడుదల చేసింది.

2018లో అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ యేడాది డిసెంబర్ 11 నాటికి రాష్ట్రంలో లక్ష లోపు పంట రుణాలు తీసుకున్న రైతులందరికి రుణమాఫీ చేస్తామని సిఎం ప్రకటించారు. ఎన్నికల హామీల్లోనూ దశలవారీగా రుణమాఫీ చేస్తామని పేర్కొన్నారు. 2018లో అధికారంలోకి వచ్చిన తర్వాత అందుకు సంబంధించిన సమగ్ర కార్యాచరణ రూపొందించాలని ఆయన భావించినట్టు ముఖ్యమంత్రి కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. వ్యవసాయ, ఆర్థిక శాఖ అధికారులు బ్యాంకులకు ప్రత్యేకంగా లేఖలు రాసి సమగ్ర వివరాలు తెప్పించుకున్నట్టు తెలిపింది. ఇదంతా జరగడానికి ఏడాది సమయం పట్టింది. అనూహ్యంగా కరోనా విజృంభించటం, లాక్‌డౌన్ ఉండడం, దేశంలో నోట్ల రద్దు తదితర పర్యవసానాలతో ఆర్థిక వ్యవస్థ ఒక్కసారిగా ఒడిదొడుకులకు గురైందని సీఎంవో ఈ సందర్భంగా పేర్కొంది. దీంతో ప్రభుత్వానికి వనరులు సమకూరడంలో ఇబ్బంది ఏర్పడింది. అయినా రూ.50 వేల లోపున్న రుణాలను (7,19,488 మంది రైతులకు సంబంధించి రూ.1,943 కోట్లను) బ్యాంకులకు చెల్లించింది. ఈ మొత్తాన్ని రైతు రుణమాఫీ కింద బ్యాంకు ఖాతాల్లో సర్దుబాటు చేసింది. మిగిలిన మొత్తాన్నీ మాఫీ చేయడానికి నిధులు సమకూర్చుకుంది. తాజాగా రూ.99,999 వరకూ ఉన్న రుణాలకు సంబంధించి 6,546.05 కోట్లను విడుదల చేసింది. తాజా నిర్ణయంతో రాష్ట్రంలోని మొత్తం 16,66, 899 మంది రైతులకు లబ్ధి చేకూరింది.

45 రోజుల కార్యాచరణ...

రైతు రుణమాఫీకి సంబంధించి ప్రభుత్వం 45 రోజుల కార్యాచరణను చేపట్టింది. ఈనెల మూడున రూ.41వేల లోపు రుణాలున్న 62,758 మంది రైతులకు సంబంధించి రూ.237.85 కోట్లను విడుదల చేశారు. నాలుగున రూ.43 వేలలోపు రుణాలున్న 31,339 మంది రైతులకు సంబంధించి రూ.126.50 కోట్లను మాఫీ చేస్తూ నిధులను బ్యాంకు ఖాతాల్లో జమ చేశారు. తాజాగా రూ.99,999 వరకూ ఉన్న రుణ మొత్తాలను ప్రభుత్వం బ్యాంకులకు జమ చేసింది. దీంతో మొత్తం రూ.7,753.43 కోట్లను (అన్ని దఫాలు, అన్ని రుణాలు, రైతులందరికీ తకలిపి) పభుత్వం రుణమాఫీ కింద చెల్లించినట్టు అధికారులు వెల్లడించారు. కాగా 2014లో బిఆర్‌ఎస్ తొలి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే అప్పటి వరకు రూ.లక్ష వరకూ ఉన్న సర్కారు మాఫీ చేసింది. తద్వారా 35.32లక్షలమంది రైతులకు నేరుగా లబ్ధి చేకూరింది. అందుకోసం ప్రభుత్వం రూ.16,144 కోట్లను వెచ్చించింది. కేంద్ర ప్రభుత్వంపై ఆధారపడకుండానే ఈ మొత్తాన్ని బ్యాంకులకు చెల్లించి రైతులను రుణ విముక్తులను చేసింది.

రైతు బీమా.. రైతు బంధు...

మరోవైపు ప్రతీ రైతుకు బీమా సౌకర్యం కల్పిస్తున్న ప్రభుత్వం.. సంబంధిత ప్రీమియం మొత్తాన్ని తానే భరిస్తున్నది. రాష్ట్రంలో వివిధ కారణాలతో ఇప్పటి వరకు మరణించిన రైతులకు సంబంధించి 1,08,051 మంది కుటుంబాలకు అండగా నిలిచింది. రూ.5,402.55 కోట్లను ఆయా కుటుంబాలకు పరిహారంగా అందించింది. రైతు మరణించిన కేవలం 15 రోజుల్లోనే బీమా సొమ్ము రైతులకు అందేలా ఏర్పాట్లు చేసిన సంగతి విదితమే. దీంతో పాటు 65 లక్షల మంది రైతులకు ప్రత్యక్ష ప్రయోజనం కలిగేలా 'రైతు బంధు' పథకాన్ని రూపొందించారు. తద్వారా ఎకరానికి సాలీనా 10వేల చొప్పున ఇప్పటి వరకూ 11 విడతల్లో కలిపి మొత్తం రూ.71, 552 కోట్లను రైతుల ఖాతాల్లో జమ చేశారు. ప్రతీయేటా రైతు బంధు అందుకునే రైతుల సంఖ్య పెరుగుతున్నది. ఈసారి కొత్తగా పోడుపట్టాలున్న వారికీ రైతుబంధు, రైతు బీమా వర్తింపజేశారు. దీంతో 1,51,469 మంది గిరిజన రైతులకు (4.06లక్షల ఎకరాలకు సంబంధించి) ప్రభుత్వం ఇప్పటికే రూ. 200 కోట్లను రైతు బంధు కింద విడుదల చేసింది. ఇది ఈ సీజన్‌కు మాత్రమే. ఈ రకంగా ఏడాదికి రూ.400 కోట్లను పోడు రైతులకు రైతుబంధు కింద అందించనున్నామని ప్రభుత్వం పేర్కొంది. మరోవైపు రాష్ట్రంలోని 27.49 లక్షల వ్యవసాయ కనెక్షన్లకు ఉచిత విద్యుత్తును అందిస్తున్నట్లు సిఎంఒ తెలిపింది. గత తొమ్మిదేండ్లలో ఇందు కోసం రూ.96,288 కోట్లను ఖర్చు చేసినట్టు వెల్లడించింది. రాష్ట్రం ఏర్పడ్డనాటి నుంచి ఆ రంగంలో మౌలిక వసతుల కల్పన కోసం రూ.32,700 కోట్లను ఖర్చు చేసినట్టు వివరించింది.

ఎస్‌బిఐ 'హర్ గర్ తిరంగా' క్యాంపెయిన్

హైదరాబాద్ : ఆజాది కా అమృత్ మహోత్సవ్ (అకమ్) కార్యక్రమాల్లో భాగంగా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 'హర్ గర్ తిరంగ' క్యాంపెయిన్‌ను నిర్వహించనున్నట్లు పేర్కొంది. కోటీలోని ఎస్‌బిఐ లోకల్ హెడ్ ఆఫీస్‌లో సోమవారం ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో ఆ బ్యాంక్ డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ అమిత్ జింగ్రన్, హైదరాబాద్ సర్కిల్ సిజిఎం రాజేష్ కుమార్, డిజిఎం మంజూ శర్మ పాల్గొన్నారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా హర్ గర్ తిరంగా క్యాంపెయిన్‌లో భాగంగా ప్రతీ ఉద్యోగి, సిబ్బంది జాతీయ జెండాతో సెల్ఫీ దిగి దేశభక్తిని చాటుకోవాలని సూచించారు.



రద్దయిన 104 సిబ్బందిని రెగ్యులర్ ఉద్యోగులుగా గుర్తించాలి

- వారి సేవలకు తగ్గ జీతభత్యాలివ్వాలి
- సిఎం కెసిఆర్‌కు తమ్మినేని లేఖ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో రద్దయిన 104 వాహన సిబ్బందిని రెగ్యులర్ ఉద్యోగులుగా గుర్తించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వారికి ఉద్యోగ భద్రత కల్పించి, వారి సేవలకు తగ్గ జీతభత్యాలివ్వాలని కోరారు. ఈ మేరకు ముఖ్యమంత్రి కె చంద్రశేఖర్‌రావుకు సోమవారం ఆయన లేఖ రాశారు. 2008లో గ్రామీణ ప్రాంత ప్రజలకు వైద్యసేవలందించేందుకు అప్పటి రాష్ట్ర ప్రభుత్వం 104 సేవలను ప్రారంభించిందని గుర్తు చేశారు. పలు గ్రామీణ ప్రాంతాల్లో ఇంటింటికీ తిరిగి దీర్ఘకాలిక వ్యాధులకు మందులిస్తూ, టెస్టులు చేస్తూ మెరుగైన సేవలందించిందని తెలిపారు. కానీ పల్లె దవాఖానాలు, ఇంటింటికీ ఎన్‌సిడి స్క్రీనింగ్ నిర్వహిస్తున్నామనే పేరుతో రాష్ట్ర ప్రభుత్వం ఆ సేవలు అవసరం లేదంటూ గతేడాది డిసెంబర్‌లో రద్దు చేసిందని పేర్కొన్నారు. ల్యాబ్‌టెక్నీషియన్ (ఎల్టీ), ఫార్మాసిస్టులను వివిధ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఎలాంటి ఆదేశాల్లేకుండా తిరిగి ఉద్యోగాల్లో నియమించారని తెలిపారు. వారికి ఉద్యోగ భద్రతైనా లేదని పేర్కొన్నారు. వైద్యుడు, ల్యాబ్ టెక్నీషియన్, ఫార్మాసిస్ట్, ఎఎన్ఎం, డేటా ఎంట్రీ ఆపరేటర్, డ్రైవర్, సెక్యూరిటీ సిబ్బందిగా పనిచేసిన సుమారు 1,350 మంది ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల అనేక ఇబ్బందులెదుర్కొంటున్నారని వివరించారు. 104ను ఎత్తేసే సమయంలో వారందరినీ ఆదుకుంటామని రాష్ట్ర ప్రభుత్వంతోపాటు, ఆరోగ్యశాఖ మంత్రి టి హరీష్‌రావు కూడా హామీ ఇచ్చారని గుర్తు చేశారు. అయినప్పటికీ ఈ ప్రభుత్వం వాటిని పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. వైద్యశాఖలో కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న ల్యాబ్ టెక్నీషియన్లు, ఫార్మాసిస్టులను ప్రభుత్వం ఇటీవలే రెగ్యులరైజ్ చేసిందని తెలిపారు. కానీ 104 ఉద్యోగులను పట్టించుకోలేదని పేర్కొన్నారు. వైద్యశాఖలో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ వారికి నెలకు రూ.30 వేలు, కొత్తగా నియామకమైన ఎల్టీ, ఫార్మాసిస్టులకు రూ.27 వేల వేతనం ఇస్తున్నారని వివరించారు. గత 15 ఏళ్లుగా పనిచేస్తున్న వారికి మాత్రం రూ.20 వేలు కూడా ఇవ్వడం లేదని తెలిపారు. ఈ అరకొర జీతాలనూ ఆర్నెల్లకోసారి కొత్తగా వచ్చే ఏజెన్సీలు ఇష్టమొచ్చినట్టు కటింగులు చేస్తూ, సమయానికి ఇవ్వడం లేదని పేర్కొన్నారు. కరోనాలోనూ వారు విలువైన సేవలందించారని గుర్తు చేశారు. మరో ఉద్యోగం కోసం నియామకమయ్యే వయస్సునూ వారు దాటిపోయారని తెలిపారు.

వరద బాధితులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలం

- అందరినీ ఆదుకోవాలి.. పంట నష్టంపై ప్రకటన చేయాలి
- సిపిఎం రాష్ట్ర నాయకత్వం డిమాండ్
- బాధితులకు రూ.13 లక్షల విలువైన వస్తువులు పంపిణీ
- మృతుల కుటుంబాలకు రూ.5 వేల చొప్పున సాయం



బాధితులకు వస్తువులను పంపిణీ చేస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి - హైదరాబాద్

వరదల్లో కొట్టుకుపోయి.. ఇల్లు కూలి.. సర్వస్వం కోల్పోయిన ప్రజలను ఆదుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని, తక్షణమే బాధితులను ఆదుకోవాలని సిపిఎం రాష్ట్ర నాయకత్వం డిమాండ్ చేసింది. ములుగు జిల్లా ఏటూరునాగారం మండలంలోని కొండాయి, మల్యాల, దొడ్ల గ్రామాల్లో సోమవారం రాష్ట్ర నాయకులు పర్యటించారు. 250 కుటుంబాలకు దుప్పట్లు, చీరలు, నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. జిల్లా వ్యాప్తంగా వరదలకు నష్టపోయిన వెయ్యి కుటుంబాలకు రూ.13 లక్షల విలువైన వస్తువులు, దుస్తులు, వంట సామాగ్రి పంపిణీ చేశారు. మృతిచెందిన వారి ఒక్కో కుటుంబానికి రూ.5000 అందజేశారు. అనంతరం సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు బండారి రవికుమార్, సూడి కృష్ణారెడ్డి మాట్లాడుతూ ములుగు జిల్లాలో గత నెల 26న కురిసిన భారీ వర్షాలకు మూడు మండలాలు 16 గ్రామాల్లో భారీ నష్టం జరిగిందన్నారు.

కొండాయి గ్రామంలో తొమ్మిది మంది, ప్రాజెక్ట్ నగరంలో ముగ్గురు, జంపన్న వాగులో మరో ఇద్దరు చనిపోయినట్టు చెప్పారు. కొండాయిలో వరద బీభత్సానికి పూర్తిగా నష్టపోయిన కుటుంబాలను ఐటిడిఎ అధికారులు ఏటూరు నాగారం మండల కేంద్రంలో పునరావాసాలకు తరలించి.. చేతులు దులుపుకున్నారని చెప్పారు. కొండాయి, మల్యాల గ్రామాల్లో 200 కుటుంబాలకు నష్టం జరిగితే కేవలం 55 కుటుంబాలకు మాత్రమే రూ.10,000 చొప్పున ఇచ్చి మిగతా కుటుంబాలను వదిలేయడం మంత్రి సత్యవతి విజ్ఞతకే వదిలేస్తున్నట్టు తెలిపారు. లోతట్టు ప్రాంతాల్లో దెబ్బతిన్న ఇండ్లకు ఇంటికి రూ.25 వేల చొప్పున పరిహారం ఇస్తామని చెప్పిన మంత్రికి 55 కుటుంబాలు మాత్రమే కనిపించాయా అని ప్రశ్నించారు. పూర్తిగా ముంపునకు గురైన కొండాయి, మల్యాల గ్రామాలను సురక్షిత ప్రాంతాలకు తరలించి పక్కా ఇండ్లు కట్టించాలని డిమాండ్ చేశారు. మరణించిన వారి కుటుంబాలకు రూ.25 లక్షలు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వెంకట్ రెడ్డి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బిరెడ్డి సాంబశివ, మండల కార్యదర్శి ఎండి దావూద్, జిల్లా కమిటీ సభ్యులు గొంది రాజేష్, కొండాయి సర్పంచి కాక వెంకటేశ్వర్లు, నాయకులు యాకూబ్, జీవన్, అరుణ్, బట్టు స్వామి పాల్గొన్నారు.

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల ఏర్పాట్లు

పర్యవేక్షించిన సిఎస్ శాంతి కుమారి



వేడుకల ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న సిఎస్ శాంతి కుమారి

ప్రజాశక్తి- హైదరాబాద్

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా చరిత్రాత్మక గోల్కొండ కోట ప్రాంగణంలో జాతీయ పతాక ఆవిష్కరణ ఏర్పాట్లను సోమవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఏర్పాట్లకు సంబంధించి జిఎడి అధికారులకు, పోలీస్ అధికారులకు ఆమె పలు సూచనలు చేశారు. ముఖ్యమంత్రి జాతీయ పతాక ఆవిష్కరణ చేయనున్న వేదికను సిఎస్ పరిశీలించారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు ఘనంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. వేడుకలు తిలకించేందుకు వచ్చే అతిథులు, ప్రజాప్రతినిధులకు ఎలాంటి ఇబ్బందులూ లేకుండా చూడాలన్నారు. పలువురు సీనియర్ ఐఎఎస్, ఐపిఎస్ అధికారులతోపాటు హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సిఎస్ వెంట ఉన్నారు.

అళహ సింగరాచార్యులు మృతికి సిఎం సంతాపం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రముఖ తెలుగు, సంస్కృత భాషా పండితులు, రిటైర్డ్ అధ్యాపకులు కండ్లకుంట అళహ సింగరాచార్యులు (93) మృతికి రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు సంతాపం ప్రకటించారు. ఆయన కుమారుడు, ఆంధ్రజ్యోతి ఎడిటర్ కె శ్రీనివాస్, ఇతర కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. సోమవారం ఈ మేరకు సిఎంఒ కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది. ఉమ్మడి నల్లగొండ జిల్లాకు చెందిన సింగరాచార్యులు సాహిత్యరంగంలో ఎంతో కృషి చేశారని కొనియాడారు. ఆయన మరణం బాధాకరమని తెలంగాణ సాహిత్య అకాడమీ అధ్యక్షులు జూలూరు గౌరీశంకర్ సంతాపం తెలిపారు. సంస్కృతాంధ్ర భాషలకు సింగరాచార్యులు విశిష్ట సేవలు అందించారని ఆయన శిష్యులు రాపోలు సుదర్శన్, సమ్మెట నాగమల్లేశ్వరరావు, తదితరులు గుర్తుచేసుకున్నారు. సింగరాచార్యులు మృతికి తెలంగాణ సారస్వత పరిషత్ పూర్వఅధ్యాపకులు డి చంద్రశేఖర్‌రెడ్డి, మోత్కూరి నరహరి తదితరులు సంతాపం ప్రకటించారు.



రైతుబంధా.. రాబందుల పాలనా?

- ఏది కావాలో ప్రజలు తేల్చుకోవాలి
- ప్రజల కష్టాలు పట్టని బిజెపి
- ఎల్లారెడ్డి సభలో మంత్రి కెటిఆర్
- వివిధ పార్టీల నాయకుల అరెస్ట్

ప్రజాశక్తి- హైదరాబాద్

'కాంగ్రెస్ వచ్చేది లేదు. వస్తే రాబంధుల రాజ్యమే.. బిఆర్‌ఎస్ ప్రభుత్వం వస్తే రైతుబంధు ప్రభుత్వం. రాబంధుల పాలన కావాలా, రైతుబంధు పాలన కావాలా' అని మంత్రి కెటిఆర్ ప్రజలను ప్రశ్నించారు. కామారెడ్డి జిల్లాలో ఐటి, మున్సిపల్ శాఖ మంత్రి కెటిఆర్ సోమవారం పర్యటించారు. కామారెడ్డి జిల్లా కేంద్రానికి వెళ్లే మార్గంలో ఆర్చ్‌ను, సెంట్రల్ లైటింగ్‌ను ప్రారంభించారు. తాడ్వాయిలో స్టేడియం పనులకు శంకుస్థాపన చేశారు. ఎల్లారెడ్డిలో పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం, శంకుస్థాపన చేశారు. అనంతరం నిర్వహించిన బహిరంగ సభలో మంత్రి మాట్లాడారు. 'సాగుకు 24 గంటల కరెంట్ ఇస్తున్న బిఆర్‌ఎస్ ప్రభుత్వం కావాలా లేక మూడు గంటలు ఇస్తా అన్న కాంగ్రెస్ ప్రభుత్వం కావాలా' అని ప్రశ్నించారు. 50 ఏళ్లలో అభివృద్ధి చేయని కాంగ్రెస్ ఇప్పుడు అభివృద్ధి చేస్తా అంటే ప్రజలు నమ్మరని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో కరెంట్ సరిగా ఉండేది కాదని, అప్పుడు పెన్షన్ రూ.200 ఉంటే బిఆర్‌ఎస్ హయాంలో రూ. 2016 చేశామని చెప్పారు. వికలాంగులకు అప్పుడు రూ.500 ఉంటే తాము రూ.4000 ఇస్తున్నట్టు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ కుంభకోణాల పార్టీ అని విమర్శించారు. ఎల్లారెడ్డిలో కాంగ్రెస్‌లో ఇద్దరు పోటీ పడుతున్నారని, ఇప్పుడు మరో నాయకుడు కూడా వెళ్తున్నారని పరోక్షంగా మాజీ ఎమ్మెల్యేపై ఆరోపణలు చేశారు.

కేంద్రంలో నరేంద్రమోడీ ప్రభుత్వం జన్‌ధన్ ఖాతాల్లో రూ.15 లక్షలు వేస్తామని ఖాతాలు తెలిపించి ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చాక హామీని నిలబెట్టుకోలేదు కానీ.. అధిక ధరలతో ప్రజల నడ్డి విరుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నా.. ప్రజల కష్టాల గూర్చి బిజెపి ఏమాత్రం పట్టించుకోవడం లేదని, మతాల మధ్య చిచ్చు పెట్టి రాజకీయ పబ్బ గడుపుకుంటోందని విమర్శించారు. రాబోయే రోజుల్లో బిజెపికి ఎల్లారెడ్డిలో డిపాజిట్టైనా రాదన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి, ఎమ్మెల్సీ సురేష్ రెడ్డి, ఎమ్మెల్యేలు గంప గోవర్ధన్, జాజాల సురేందర్, రసమయి బాలకిషన్, జడ్‌పి చైర్మెన్ శోభ, మాజీ మంత్రి నేరెళ్ల ఆంజనేయులు, కలెక్టర్ జితేష్ వి పాటిల్, రాష్ట్ర గ్రంథలయ చైర్మెన్ శ్రీధర్, బిఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షులు ముజీబొద్దిన్, ఎల్లారెడ్డి మున్సిపల్ చైర్మెన్ కుడుముల సత్యనారాయణ, ఎంసి చైర్మెన్ కాశినారాయణ, జడ్‌పిటిసి ఉష గౌడ్, ఎంపిపి మాధవి తదితరులు పాల్గొన్నారు.

కెటిఆర్‌కు స్వల్ప అస్వస్థత

జిల్లా పర్యటనకు వచ్చిన మంత్రి కెటిఆర్ స్వల్ప అస్వస్థతకు గురయ్యారు. జిల్లా కేంద్రంలో పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవాల సందర్భంగా అస్వస్థతకు గురి కావడంతో ఆర్‌అండ్‌బి గెస్ట్‌లో విశ్రాంతి తీసుకున్నారు. కొద్ది సేపటి తర్వాత మళ్లీ కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

ముందస్తు అరెస్ట్

కెటిఆర్ పర్యటన నేపథ్యంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు చంద్రశేఖర్‌తో పాటు నాయకులు రాజనర్సు, లంబాడి హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షులు గణేశ్ నాయక్, మాలోత్ నౌసిల్లల్ నాయక్, కాంగ్రెస్ నాయకులను ముందస్తుగా అరెస్టు చేశారు. తాడ్వాయి నుంచి ఎల్లారెడ్డికి వెళ్తుండగా.. మంత్రి కాన్వాయ్‌ను కాంగ్రెస్ నాయకులు అడ్డుకునే ప్రయత్నం చేయగా పోలీసులు చెదరగొట్టారు.

జెండా పండుగకు సర్వం సిద్ధం..

- 'మువ్వన్నెల'తో ముస్తాబైన అసెంబ్లీ, సచివాలయం, గన్‌పార్కు
- గోల్కొండ కోటలో త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించనున్న సిఎం కెసిఆర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు రాష్ట్రం ముస్తాబైంది. హైదరాబాద్‌తోపాటు అన్ని జిల్లాల్లోనూ మంగళవారం వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అధికార యంత్రాంగం ఏర్పాట్లను పూర్తి చేసింది. ఇవి స్వతంత్ర భారత వజ్రోత్సవ ముగింపు వేడుకలూ కావడంతో ప్రభుత్వం వీటిని ఉత్సాహ పూరిత వాతావరణంలో స్ఫూర్తిదాయకంగా నిర్వహించా లంటూ ఆదేశాలు జారీ చేసింది. ఇందులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి ఉదయం 8.30 గంటలకు సచివాలయంలో జాతీయ జెండాను ఎగరేస్తారు. ఉదయం 10.30 గంటలకు గోల్కొండ కోటలో ముఖ్యమంత్రి కెసిఆర్ త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించనున్నారు. దాంతోపాటు తన అధికారిక నివాసమైన ప్రగతి భవన్‌లోనూ ఉదయం తొమ్మిది గంటలకు ఆయన జెండాను ఎగరేస్తారు. అంతకు ముందు సికింద్రాబాద్‌లోని పరేడ్ మైదానంలో సిఎం సైనిక అమరవీరులకు శ్రద్ధాంజలి ఘటిస్తారు. వారు దేశానికి చేసిన సేవలను స్మరించుకుంటారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మంగళవారం రాత్రి ఏడు గంటలకు రాజ్‌భవన్‌లో రాష్ట్ర గవర్నర్ డాక్టర్ తమిళి సై సౌందర రాజన్ 'ఎట్ హోం' కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి రావాలంటూ సిఎం కెసిఆర్‌తోపాటు మంత్రులు, ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులను ఆమె ఆహ్వానించారు.

పంద్రాగస్టును పురస్కరించుకుని గోల్కొండ కోట, అసెంబ్లీ, సచివాలయం, గన్‌పార్కు, అమరవీరుల స్థూపం, అంబేద్కర్ విగ్రహం, సికింద్రాబాద్, నాంపల్లి, కాచిగూడ రైల్వే స్టేషన్లు, చార్మినార్, పబ్లిక్ గార్డెన్, శాసనసభ, మండలి సర్వాంగ సుందరంగా ముస్తాబయ్యాయి. గోల్కొండ కోటతోపాటు సచివాలయంలోని ఏర్పాట్లపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, డిజిపి అంజనీకుమార్... సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఎక్కడా ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూసుకోవాలంటూ అధికారులను ఆదేశించారు. గోల్కొండ కోటలో నిర్వహించే సభను వీక్షించేందుకు 14 పెద్ద పెద్ద ఎల్ఇడిలను ఏర్పాటు చేశారు. మొత్తం 1,930 వాహనాలను నిలిపేందుకు వీలుగా పార్కింగ్ సౌకర్యాన్ని కల్పించినట్టు అధికారులు వెల్లడించారు. వేడుకల సందర్భంగా సోమవారం గోల్కొండ కోటలో పోలీసు, అటవీ, ఫైర్ తదితర శాఖలకు చెందిన వివిధ దళాలు పూర్తి డ్రెస్ రిహార్సల్స్‌లో పాల్గొన్నాయి. మరోవైపు జిల్లాల్లోని కలెక్టరేట్లు, ఎస్‌పి కార్యాలయాలు సైతం వేడుకలకు ముస్తాబయ్యాయి. హైదరాబాద్‌లోని వివిధ పార్టీల రాష్ట్ర కార్యాలయాల్లోనూ జాతీయ జెండాను ఆవిష్కరించనున్నారు. ఇక్కడి సుందరయ్య విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో ఉదయం పది గంటలకు నిర్వహించే సెమినార్‌లో ఎస్‌వికె ట్రస్టు కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, ప్రొఫెసర్ హరగోపాల్ ప్రసంగిస్తారు.

20న హైదరాబాద్‌లో గద్దర్ సంస్మరణ సభ

- సిపిఎం, సిపిఐ ఉమ్మడిగా నిర్వహణ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రజా యుద్ధనౌక గద్దర్ సంస్మరణ సభను ఈ నెల 20న ఉదయం పది గంటలకు హైదరాబాద్‌లోని బాగ్‌లింగంపల్లిలో ఉన్న సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించనున్నట్టు సిపిఎం, సిపిఐ రాష్ట్ర కార్యదర్శులు కూనంనేని సాంబశివరావు, తమ్మినేని వీరభద్రం తెలిపారు. ఈ సంస్మరణ సభలో వామపక్ష పార్టీలు, లౌకిక, ప్రజాతంత్ర శక్తులు, విప్లవ శక్తులు, కవులు, కళాకారులు, గద్దర్ అభిమానులు, పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని వారు సోమవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. అనారోగ్య కారణాలతో ఈ నెల 6న గద్దర్ మరణించిన విషయం తెలిసిందే.

ప్రజలకు స్వాతంత్య్ర దినోత్సవ శుభాకాంక్షలు

- గవర్నర్ డాక్టర్ తమిళిసై

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మనం నేడు అనుభవిస్తున్న స్వేచ్ఛ కోసం నిస్వార్థంగా పోరాడిన మన పూర్వీకుల త్యాగాలను, ధైర్యాన్ని స్మరించుకోవాలని రాష్ట్ర గవర్నర్ డాక్టర్ తమిళిసై సౌందర రాజన్ సూచించారు. ప్రజలకు 77వ స్వాతంత్య్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. భారతీయులు మరింత మెరుగైన జీవితం కోసం ప్రారంభించిన అమ్రిత్ కాల్‌కు ఏడాదైందని ఆమె గుర్తు చేశారు. మెరుగైన భారత నిర్మాణానికి అంకితభావంతో పని చేయాలని కోరారు. స్వయం సాధికారత, నాణ్యమైన విద్య, మహిళా సాధికారత, పర్యావరణ పరిరక్షణ, ఆర్థికవృద్ధితో అందరికి లబ్ది చేకూరుతుందని వివరించారు.

అరెస్టులతో అడ్డుకోలేరు

- వెంటనే విడుదల చేయాలి : రేవంత్ రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అక్రమ అరెస్టులతో కాంగ్రెస్ నాయకులను అడ్డుకోలేరని టిపిసిసి అధ్యక్షులు రేవంత్ రెడ్డి తెలిపారు. వరంగల్ కాంగ్రెస్ నాయకుల అక్రమ అరెస్టుల పట్ల ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం హైదరాబాద్ గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడుతూ ఇటీవల భారీ వర్షాలకు, వరదలకు నగరం తీవ్రంగా దెబ్బతిన్నా... ఒక్క పైసా నష్టపరిహారం గాని, నష్ట నివారణ కార్యక్రమాలు గాని చేపట్టలేదని తెలిపారు. అందుకు నిరసనగా గ్రేటర్ వరంగల్ కార్యాలయం వద్ద నిరసన తెలిపిన కాంగ్రెస్ నాయకులను గృహ నిర్బంధాలు చేసి, అక్రమ అరెస్టులు చేశారని తీవ్రంగా ఖండించారు. నాయకులతో కార్పొరేషన్ అధికారులు మాట్లాడాలని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యలను నిర్లక్ష్యం చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు

రహదారి మరమ్మతులు పట్టవా..?

- ప్రమాదకరంగా ఖమ్మం- బోనకల్ రోడ్డు
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని
- రోడ్డు కోసం పాదయాత్ర ప్రారంభం



పాదయాత్ర చేస్తున్న సిపిఎం నేతలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఖమ్మం-బోనకల్ రహదారిపై నిత్యం రోడ్డు ప్రమాదాలు జరిగి జనం ప్రాణం కోల్పోతున్నా జిల్లా మంత్రి పువ్వాడ అజయ్ కుమార్, మధిర ఎమ్మెల్యే మల్లు భట్టి విక్రమార్కకు బాధ్యత లేకుండా పోయిందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్‌రావు అన్నారు. అధ్వానంగా ఉన్న ఖమ్మం-బోనకల్ ప్రధాన రహదారి మరమ్మతుల చేపట్టాలని కోరుతూ సోమవారం సిపిఎం ఆధ్వర్యంలో పందిళ్లపల్లి నుంచి నాగులవంచ వరకు చేపట్టిన పాదయాత్రను పోతినేని జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖమ్మం- బోనకల్ ప్రధాన రహదారి ప్రమాదకరంగా మారిందన్నారు. ప్రజలకు ఉపయోగపడే రహదారులను విస్మరించి కార్పొరేట్లకు చెందిన గ్రీన్‌ఫీల్డ్ రహదారుల ఏర్పాటుకు ప్రాధాన్యత ఇవ్వడం సరికాదన్నారు. మంత్రి పువ్వాడ కేవలం ఖమ్మం నియోజకవర్గం మంత్రి కాదని, జిల్లా సర్వతోముఖాభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఈ రోడ్డు మార్గంలో తిరుగుతున్న ఎమ్మెల్యే మల్లు భట్టి విక్రమార్క తన నియోజకవర్గంలో రోడ్ల సమస్య పరిష్కరించకుండా రాష్ట్ర సమస్యల కోసం పాదయాత్ర చేస్తున్నానని చెప్పటం సిగ్గుచేటన్నారు. ఈ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేస్తానంటున్న జిల్లా పరిషత్ చైర్మెన్ లింగాల కమల్‌రాజు కనీసం ఈ రోడ్డు మరమ్మతులపై నోరు మెదపకపోవడం బాధ్యతారాహిత్యమన్నారు. ఆరు నెలల వ్యవధిలో 18 మంది మృతిచెందడంతోపాటు చాలా మంది గాయపడ్డారని, అయినా పాలకులు పట్టించుకోకపోవడం దారుణమని అన్నారు.

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, మధిర నియోజకవర్గ కన్వీనర్ పాలడుగు భాస్కర్, జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, రాష్ట్ర కమిటీ సభ్యులు పొన్నం వెంకటేశ్వరరావు మాట్లాడారు. రోడ్డు ప్రమాదాల్లో ప్రజలు ప్రాణం కోల్పోతున్నా అటు అధికారులు, ఇటు ప్రజా ప్రతినిధులు కనీసం స్పందించకపోవడం సరికాదన్నారు. తక్షణమే రోడ్డు మరమ్మతు పనులు చేపట్టకపోతే పెద్దఎత్తున ఉద్యమం చేపడతామని, ఖమ్మం-బోనకల్ రహదారి దిగ్బంధనం చేస్తామని హెచ్చరించారు. పాదయాత్రలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు చింతలచెరువు కోటేశ్వరరావు, మండల కార్యదర్శి మడిపల్లి గోపాలరావు, నాయకులు వత్సవాయి జానకి రాములు, తోటకూరి వెంకట నరసయ్య, ఆలస్యం రవి, నన్నక కృష్ణమూర్తి, దేశబోయిన ఉపేందర్, రాచబంటి రాము, లింగం కోటేశ్వరరావు, కాటబత్తిని వీరబాబు, కూచిపూడి బుచ్చిబాబు, మద్దిన్ని బసవయ్య, పులి యజ్ఞ నారాయణ, వాక సీతారామిరెడ్డి, పంగా గోపయ్య, కిరణ్ బాబు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు బంధం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

జహీరుద్దీన్ అలీఖాన్ మృతి తీరని లోటు

- సంతాపసభలో అజీజ్‌పాషా, కె.శ్రీనివాస్‌రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అభ్యుదయ, లౌకికవాది సీనియర్ జర్నలిస్టు సియాసత్ ఎడిటర్ జహీరుద్దీన్ అలీఖాన్ మరణం సమాజానికి తీరని లోటని 'తన్ ఇన్సాఫ్' జాతీయ అధ్యక్షులు, మాజీ ఎంపి సయ్యద్ అజీజ్ పాషా, ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్ అధ్యక్షులు కె.శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. 'జహీరుద్దీన్ అలీ ఖాన్' సంతాప సభను సోమవారం హైదరాబాద్‌లోని మగ్దూం భవన్‌లో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అజీజ్ పాషా మాట్లాడుతూ.. జహీరుద్దీన్ అలీఖాన్ ఒక సామాజిక సేవకుడనీ అన్నారు. సమాజ అభ్యున్నతి కోసం ఆయన పరితపించేవారనీ, వేలాది మంది యువతకు కంప్యూటర్, స్వయం ఉపాధి శిక్షణ ఇప్పించారని కొనియాడారు. దేశానికి కమ్యూనిస్టుల అవసరం ఎంతో ఉందని ఆయన విశ్వసించేవారన్నారు. భారతదేశం అభ్యున్నతి చెందాలనీ, మతోన్మాద రాజకీయాలను తీవ్రంగా వ్యతిరేకించేవారని గుర్తుచేశారు. మణిపూర్ ఘటనపై ప్రధాని మోడీ పార్లమెంట్‌కు ఇచ్చిన సమాధానాన్ని అందరూ చూశారనీ, ప్రతిపక్షాలను అవహేళన చేస్తూ మాట్లాడారని విమర్శించారు. దేశానికి మంచిరోజులు రావాలంటే వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో మోడీ ప్రభుత్వాన్ని ఓడించాలని పిలుపునిచ్చారు. కె.శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ అబిద్ అలీ ఖాన్ ప్రారంభించిన సియాసత్ ఉర్దూ దినపత్రిక లౌకక వాదానికి కట్టుబడి ఉన్నదన్నారు. అబీద్ అలీఖాన్ తర్వాత జాహేద్ అలీఖాన్, ఆ తర్వాత జహీరుద్దీన్ అలీఖాన్ ఆ విలువలను కొనసాగించారని కొనియాడారు. ఆయన నిరంతరం ప్రజల కోసం పరితపించేవారన్నారు. పత్రికలన్నీ ఏకపక్షంగా వార్తలు ప్రచురించడం పట్ల ఆయన ఆందోళన వ్యక్తం చేసేవారన్నారు. ఆయన అందరికీ మంచి స్నేహితుడనీ, ఆయన మరణం సామాజిక ఉద్యమాలకు, ప్రజాస్వామ్యానికి పూడ్చలేని లోటని అభివర్ణించారు. కార్యక్రమంలో అవాజ్ నాయకులు అబ్దుల్ సత్తార్, ఇన్సాఫ్ హైదరాబాద్ అధ్యక్షుడు షేక్ నదీమ్, సలాం ఉల్లాఖాన్, నవాజ్, మునీర్, తదితరులు పాల్గొన్నారు.



సెప్టెంబర్‌లో కాంగ్రెస్ అభ్యర్థుల ప్రకటన

- టిపిసిసి ఎన్నికల స్క్రీనింగ్ కమిటీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాబోయే అసెంబ్లీ ఎన్నికలకుగాను కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను సెప్టెంబర్‌లో ప్రకటించనున్నది. సోమవారం గాంధీభవన్‌లో టిపిసిసి అధ్యక్షులు రేవంత్‌రెడ్డి అధ్యక్షతన టిపిసిసి ఎన్నికల కమిటీ, టిపిసిసి ఎన్నికల స్క్రీనింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. సమావేశంలో స్క్రీనింగ్ కమిటీ చైర్మన్ మురళీధర్, సభ్యులు బాబా సిద్ధికీ, జిగ్నేష్ మేవాని, సిఎల్‌పి నేత భట్టి విక్రమార్క తదితరులు పాల్గొన్నారు. అనంతరం టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్లు మహేష్ కుమార్ గౌడ్, అంజన్ కుమార్ యాదవ్ మీడియాతో మాట్లాడుతూ ఎన్నికల వ్యూహం, అభ్యర్థుల ఎంపికపై చర్చించినట్టు తెలిపారు. దామోదర రాజనర్సింహ చైర్మన్‌గా, రోహిత్ చౌదరి, మహేష్ గౌడ్ సభ్యులుగా సబ్ కమిటీ ఏర్పాటు చేశామనీ, ఆ కమిటీ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవడానికి విధివిధానాలు, రుసుములపై నివేదిస్తుందని తెలిపారు. ఈ నెల 17వ తేదీ వరకు విధివిధానాలు ఖరారవుతాయనీ, 18 నుంచి 25వ తేదీ వరకు డిడి రూపంలో రుసుం చెల్లించి దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. టికెట్ ఆశించేవారు గాంధీభవన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని చెప్పారు. సెప్టెంబర్ మొదటి వారంలో మరోసారి ఎన్నికల కమిటి సమావేశం నిర్వహించి దరఖాస్తులను పరిశీలించి పిఇసిలో సమర్పిస్తామన్నారు.

వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ వద్ద ఉద్రిక్తత

- హామీలను అమలు చేయాలంటూ ముట్టడికి యత్నించిన కాంగ్రెస్
- నాయకుల ముందస్తు అరెస్ట్
- ముఖ్య నాయకుల గృహనిర్బంధం



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ వద్ద ఉద్రిక్తత ఏర్పడింది. రాష్ట్రంలో బిఆర్ఎస్ అధికారంలోకి రావడానికి ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో వరంగల్, హనుమకొండ జిల్లాల నాయకులు కార్పొరేషన్ కార్యాలయం ముట్టడికి యత్నించారు. ఉదయమే పోలీసులు నాయకులను ముందస్తుగా ఇళ్ల వద్దనే నిర్బంధించారు. మాజీ మంత్రి కొండా సురేఖ, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి, కాంగ్రెస్ వరంగల్ జిల్లా అధ్యక్షులు ఎర్రబెల్లి స్వర్ణ తదితర ముఖ్య నాయకులను గృహనిర్బంధంలో ఉంచారు.

పోలీసుల నిర్బంధం నుంచి కొందరు కాంగ్రెస్ శ్రేణులు తప్పించుకొని రోడ్ల మీదికి వచ్చారు. పోలీసులు వరంగల్ ఎసిపి బోనాల కిషన్ ఆధ్వర్యంలో ఎంజిఎం సర్కిల్‌లో భారీకేడ్లను ఏర్పాటు చేశారు. ఇంతేజార్‌గంజ్ సిఐ శ్రీనివాస్, మెట్టవాడ సిఐ ఎన్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేసి మున్సిపల్ కార్పొరేషన్ వైపు ఎవరినీ అనుమతించలేదు. కాంగ్రెస్ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షులు నాయిని రాజేందర్ ఆధ్వర్యంలో హనుమకొండ పశ్చిమ, వర్ధన్నపేట నియోజకవర్గల కాంగ్రెస్ శ్రేణులు వరంగల్ ఎంజిఎం, రాజీవ్ గాంధీ విగ్రహం వద్దకు చేరుకున్నారు. బారీకేడ్లను దాటుకొని మున్సిపల్ కార్పొరేషన్ వైపు వెళ్లే ప్రయత్నం చేయడంతో పోలీసులు అడ్డుకున్నారు. దీంతో ప్రభుత్వానికి, పోలీసులకు వ్యతిరేకంగా నేతలు నినాదాలు చేశారు. ఈ క్రమంలో స్వల్ప తోపులాట, వాగ్వాదం జరిగింది. శాంతియుతంగా ఆందోళన చేయడానికి వస్తే అడ్డగించారని, ఇది దుర్మార్గమని ఆవేదన వ్యక్తం చేశారు. నాయకులు, కార్యకర్తలను బలవంతంగా లాక్కెళ్లి పోలీస్ వాహనాల్లోకి ఎక్కించి మామనూరు పోలీస్ ట్రెయినింగ్ కళాశాలకు తరలించారు.

వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ముట్టడికి బయలుదేరిన వర్ధన్నపేట నియోజకవర్గం కాంగ్రెస్ నాయకులు మాజీ ఎస్‌పి నాగరాజు బల్దియా కార్యాలయంలోకి ప్రవేశించేందుకు యత్నించగా పోలీసులు అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. వరంగల్ మున్సిపల్‌నగర్‌లో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వరదలతో ముంపునకు గురైన ప్రజలను తక్షణమే ఆదుకోవాలని నాయకులు డిమాండ్ చేశారు. ముట్టడి కార్యక్రమాన్ని నిర్వీర్యం చేయడానికి గ్రామీణ ప్రాంతాల్లో సోమవారం తెల్లవారుజామునే కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలను పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. పర్వతగిరి మండలంలో కిసాన్ కాంగ్రెస్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు బొంపెల్లి దేవేందర్ రావును హౌస్ అరెస్టు చేశారు. ఖానాపురం, వేలేరు మండల కాంగ్రెస్ నాయకులను అరెస్టు చేశారు.



స్వాతంత్ర్య త్యాగధనులు సదాస్మరణీయులు

- జల వనరుల అభివృద్ధి సంస్థ చైర్మన్ సముద్రాల

ప్రజాశక్తి - కల్చరల్

ఎందరో మహనీయుల త్యాగాల ఫలితంగా నేడు మనం స్వాతంత్ర ఫలాలు అనుభవిస్తున్నామని వారు సదా స్మరణీయులని రాష్ట్ర జల వనరుల అభివృద్ధి సంస్థ చైర్మన్ డాక్టర్ సముద్రాల వేణుగోపాలాచారి అన్నారు. తెలుగు విశ్వవిద్యాలయంలోని ఎన్‌టిఆర్ కళా మందిరంలో ఆర్‌కె ఫౌండేషన్ నిర్వహణలో జాతీయ జెండా రూపకర్త పింగళి వెంకయ్యకు నివాళిగా పింగళి వెంకయ్య కళా సమితి సౌజన్యంతో నృత్య నీరాజనం అర్పించారు. ఈ సందర్భంగా జరిగిన సభా కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ వేణు గొపాలాచారి మాట్లాడుతూ మరుగున పడిపోతున్న వెంకయ్య పేరిట నృత్య నీరాజనంలో నేటి తరం వారిని ఎంచుకొని ప్రదర్శన చేయించడంతో రంజిత్ కుమార్ స్ఫూర్తిని నింపారని అభినందించారు.

లైంగిక వేధింపులపై సిట్ విచారణ జరపాలి

- క్రీడలు, హోం శాఖ మంత్రులను బర్తరఫ్ చేయాలి
- బిఎస్‌పి రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హకీంపేట్ క్రీడల పాఠశాలలోని విద్యార్థినులపై జరిగిన లైంగిక వేధింపులపై సిట్ విచారణ జరపాలని బిఎస్‌పి రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం హైదరాబాద్‌లోని ఆ పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఢిల్లీ తరహాలో మన రాష్ట్రంలోనూ బ్రిజ్ భూషణ్ లున్నారని విమర్శించారు. ఓ వెటర్నరీ డాక్టర్ హరికృష్ణకు హకీంపేట్ స్పోర్ట్స్ స్కూల్‌లో ఏలా స్పెషల్ ఆఫీసర్‌గా నియమిస్తారని, పశుసంవర్ధక శాఖ నుండి క్రీడా శాఖకు ఎలా బదిలీ చేశారని ప్రశ్నించారు. తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం నాయకుడనే ఒకే ఒక్క కారణంతో క్రీడల మంత్రి శ్రీనివాస్ గౌడ్ అతనికి డిప్యుటేషన్ ఇచ్చారని ఆరోపించారు. కీచకుడు డాక్టర్ హరికృష్ణపై ప్రభుత్వం సిట్ వేసి స్పోర్ట్స్ స్కూల్‌లో జరిగిన లైంగిక వేధింపులపై పూర్తి స్థాయిలో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు పూర్తిగా క్షీణించాయని ఆవేదన వ్యక్తం చేశారు. హైదరాబాద్ పరిధిలోని జల్‌పల్లి మున్సిపాలిటీలో ప్రజా సమస్యలపై పోరాటం చేస్తున్న పాత బస్తీకి చెందిన సామాజిక కార్యకర్త షేక్ సయీద్ బావజీర్‌ను బండ్లగూడలో హత్య చేయడం దారుణమన్నారు. హత్యకు ముందే హోంమంత్రి మహమూద్ అలీకి ఫోన్ ద్వారా ఫిర్యాదు చేసినా ప్రాణాలు కాపాడలేకపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల ప్రాణాలను రక్షించలేని హోంమంత్రి తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. పోలీసుల నిర్లక్ష్యంతోనే రామాయంపేటలో ఖదీర్‌ఖాన్‌ను లాకప్‌డెత్ చేశారని, రాష్ట్రంలో గుండాయిజం పెరిగిపోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. అధికార పార్టీ నేతలే హత్యలను ప్రోత్సహిస్తున్నారని ఆరోపించారు. మీడియా సమావేశంలో పార్టీ రాష్ట్ర కో ఆర్డినేటర్ వెంకటేష్ చౌహన్, ముస్లిం యునైటెడ్ ఫ్రెండ్ ఫెడరేషన్. కన్వీనర్ ఖైరుద్దీన్ సుఫీ, హర్షద్ హుస్సేన్, మహ్మద్ షఫీ, అబ్రహర్ హుస్సేన్ బిఎస్‌పి అధికార ప్రతినిధి అరుణ క్వీన్ తదితరులు పాల్గొన్నారు.

వైవిధ్యం పట్ల నిబద్ధతకు టి-ఎఐఎం నిదర్శనం

- ఐటి, పరిశ్రమల శాఖ ముఖ్యకార్యదర్శి జయేష్‌రంజన్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆవిష్కరణ, వైవిధ్యం, శ్రేష్ఠత పట్ల తమ అచంచలమైన నిబద్ధతకు తెలంగాణ ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్ మిషన్(టి-ఎఐఎం) నిదర్శనమని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలశాఖ ముఖ్యకార్యదర్శి జయేష్‌రంజన్ అన్నారు. చిన్న రాష్ట్రంగా, తమ డైనమిక్ ఎఐ పర్యావరణ వ్యవస్థ ఇతరులను అనుకరించడానికి బ్లూప్రింట్‌గా పనిచేస్తుందన్నారు. స్థానిక, ప్రపంచ రంగాలలో పరివర్తనను రేకెత్తించడానికి సిద్ధంగా ఉందన్నారు. తెలంగాణకు ఎఐ వ్యూహాత్మకత ఆవశ్యకత ఉందన్నారు. తెలంగాణ ఎఐ మిషన్ ఆధ్వర్యంలో పర్యావరణ వ్యవస్థ సమగ్ర నివేదికను సోమవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ సాంకేతిక ఆవిష్కరణలకు అభివృద్ధి చెందుతున్న కేంద్రంగా ఉందన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఎఐ) రంగంలో రాష్ట్రం అద్భుతమైన పురోగతిని నొక్కిచెబుతూ 'తెలంగాణలో ఎఐ పర్యావరణ వ్యవస్థ స్థితి' నివేదికను ఆవిష్కరించిందన్నారు. నాస్కామ్ ద్వారా ఆధారితం, తెలంగాణ ప్రభుత్వం ప్రారంభించిన తెలంగాణ ఎఐ మిషన్ ద్వారా నిర్వహించిన ఈ సమగ్ర నివేదిక, ప్రపంచ ఎఐ పవర్‌హౌస్‌గా, తెలంగాణ ఉల్క పెరుగుదలను ప్రకాశిస్తుందని తెలిపారు. రాష్ట్రం సమర్థవంతమైన, సురక్షితమైన, పౌరుల కోసం క్లిష్టమైన రంగాలలో సాంకేతిక పరిజ్ఞానాన్ని నింపడానికి ఇతర ప్రాజెక్టులతో పాటు వ్యవసాయ వస్తువుల నాణ్యత అంచనా, సెల్ఫీ ద్వారా పెన్షనర్స్ లైఫ్ సర్టిఫికేట్ ప్రమాణీకరణ, గుంతల గుర్తింపు, మ్యాపింగ్ వంటి పరివర్తనాత్మక ప్రాజెక్టులను నడుపుతోందని వివరించారు.

ఆఫీసులు, ఐటీ పార్కుల్లో ప్రీ-స్కూల్స్ అవసరం

- తొమ్మిదో నిజాం రౌనక్ యార్‌ఖాన్
- హైటెక్స్‌లో యూరోపియన్ సైంటిఫిక్ స్కూల్ : అపెర్నా వొల్లూరు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆఫీసులు, ఐటి పార్కుల్లోనూ ప్రీ-స్కూల్స్‌ను ఏర్పాటు చేయాలని తొమ్మిదో నిజాం రౌనక్‌యార్‌ఖాన్ తెలిపారు. ఐదేండ్ల నుంచి పిల్లలకు రోబోటిక్స్, జిమ్నాస్టిక్స్ బోధించే ఏకైక పాఠశాల అని అన్నారు. గచ్చిబౌలిలోని ఈ ప్రీ-స్కూల్‌లో స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా సోమవారం కార్యక్రమాలు నిర్వహించింది. ఈ సందర్భంగా న్యూరో సైంటిఫిక్ స్కూల్ సహ వ్యవస్థాపకులు అపెర్నా వొల్లూరు మాట్లాడుతూ ఈ స్కూల్‌నున తెలంగాణకు చెందిన తెలుగు-ఇటాలియన్ న్యూరో సైంటిస్ట్ స్థాపించారని తెలిపారు. ఆమె ఇటాలియన్‌ని వివాహం చేసుకున్నారని, మూడు దశాబ్దాలుగా ఇటలీలోని బారీలో నివసిస్తున్నారని చెప్పారు. ఆమె ప్రపంచవ్యాప్తంగా ఉన్న 260 మంది న్యూరో సైంటిస్టుల్లో ఒకరని, ఆ స్పెషలైజేషన్‌లో రెండో వ్యాపారవేత్తని వివరించారు. మై స్కూల్ ఇటలీ అనేది ఒక న్యూరోసైంటిఫిక్ యూరోపియన్ స్కూల్, ఇది ప్రపంచంలోనే మొట్టమొదటి న్యూరోసైంటిఫిక్ ప్రీస్కూల్ అని తెలిపారు. ఈ పాఠశాలకు భారతదేశంలో 50 శాఖలు ఉన్నాయని, ప్రస్తుతం హైదరాబాద్‌లో 3 శాఖలు ఉన్నాయని తెలిపారు. మాదాపూర్‌లోని హైటెక్స్‌లో మరో కేంద్రం ప్రారంభానికి సన్నాహాలు చేస్తున్నారని చెప్పారు. సెప్టెంబర్ 5న లాంఛనంగా తెరవబడుతుందని, దీని ఏర్పాటుకు తమ శాఖల్లో ఎక్కువ భాగం ఐటీ పార్కులు, ఐటీ కార్యాలయాల్లో ఉన్నాయని, టెక్ మహీంద్రాలో మాకు 32 కేంద్రాలు ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో చాప్టర్ ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ తెలంగాణ చాప్టర్ చైర్మన్ అజయ్ మిశ్రా, క్యూ-సిటీ జనరల్ మేనేజర్ మాల్తీ మోరిసెట్టి తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నేపథ్యంలో సమస్యలపై చర్చోపచర్చలు

జలవివాదాలే ప్రధానం • జాడలేని అపెక్స్ కౌన్సిల్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సాధారణ ఎన్నికలు సమీస్తున్న నేపథ్యంలో రాజకీయ పార్టీలు, నేతలు ప్రజాసమస్యలపై వాడీవేడీ విమర్శలకు దిగుతున్నారు. అధికార పార్టీతోపాటు ప్రతిపక్షాలు సైతం ఒకరిపై మరొకరు రాజకీయ దాడికి దిగుతున్నారు. సుమారు రెండు నెలల్లో ఎన్నికలు రానున్న కారణంగా విమర్శలు, అరోపణల తీవ్రత పెరుగుతూ వస్తుంది. ఇటు ప్రభుత్వ యంత్రాంగం సైతం హడావిడి చేస్తున్నది. కేంద్రంపై ఒత్తిడి చేయడం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం సమస్యల పరిష్కారానికి సహకరించాలని కోరుతోంది. ఇదే సందనుకుని ఢిల్లీలో మోడీ సర్కారు తమ రాజకీయ ప్రయోజనాలకు అనుగుణంగా పావులు కదుపుతోంది. తమ పార్టీ అధికారంలో ఉన్న రాష్ట్రాలకు ఒక రకంగా, ప్రతిపక్ష పార్టీలున్న చోట్ల మరోరకంగా వ్యవహరిస్తోంది. పునర్విభజన సమస్యలతోపాటు జాతీయ హోదాతో కూడిన సాగునీటి ప్రాజెక్టు, జాతీయ రహదారులు, ఇతర సమస్యల విషయంలో పక్షపాత ధోరణిని అనుసరిస్తోంది. దీంతో ఇబ్బందులు తప్పడం లేదు. సాగునీటి సమస్యలైతే మరీ ఎక్కువగా ఉన్నాయి. ప్రధానంగా తెలుగు రాష్ట్రాల మధ్య జల వివాదాల పరిష్కారం ఒక అడుగు ముందుకు రెండడుగులు వెనక్కిలా తయారైంది. ఉన్నతస్థాయి సమావేశాలు సరిగ్గా జరగకపోవడం, ఆ మేరకు ముఖ్యమంత్రుల స్థాయిలో చొరవ తక్కువగా ఉండటం కీలకమైన సమస్యలు పెండింగ్‌లో ఉండటానికి కారణమవుతోంది. కెఆర్ఎంబి, జిఆర్ఎంబిల పేర తెలుగు రాష్ట్రాల్లోని సాగునీటి ప్రాజెక్టులపై పెత్తనం చేస్తున్న మోడీ సర్కార్, ఆయా సమస్యల పరిష్కారానికి మాత్రం శ్రద్దపెట్టడం లేదు.

బిజెపి వంద అబద్ధాలు

- బుక్‌లెట్, సిడిలను ఆవిష్కరించిన మంత్రి కెటిఆర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ వైఫల్యాలను, తెలంగాణకు చేసిన అన్యాయాలను వివరిస్తూ బిఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియా విభాగం రూపొందించిన 'బిజెపి వంద అబద్దాలు' బుక్‌లెట్, సిడినీ ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి కెటిఆర్ ప్రగతిభవన్‌లో సోమవారం ఆవిష్కరించారు. బిఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియా విభాగం నాలుగు నెలలుగా బిజెపి వైఫల్యాలను బట్టబయలు చేస్తూ వస్తోంది. బిఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్లు మన్నె క్రిషాంక్, వై సతీష్‌రెడ్డి, జగన్ మోహన్‌రావు, దినేష్‌చౌదరి ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. దేశ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా మోడీ సర్కారు ఎలా మోసం చేసింది? తెలంగాణ ప్రజలకు హక్కుగా రావాల్సిన వాటిని ఎలా అడ్డుకుంటున్నారనే విషయాలను ఇందులో వివరించారు. బిజెపి తప్పులను ప్రతీరోజు బయటపెడుతున్నామని తెలిపారు. నిరుద్యోగం, ద్రవ్యోల్బణం, భారంగా మారిన జిఎస్‌టి, ప్రతీ ఇంటికి ఇంటర్నెట్ సదుపాయం, అందరికీ ఇల్లు, విభజన హామీల అమలు, బయ్యారం స్టీల్‌ప్లాంట్, ఐటిఐఆర్, కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ, ఎస్టీ రిజర్వేషన్లతో పాటు బిజెపి నాయకుల అసలు రూపాన్ని ఈ క్యాంపెయిన్‌లో బయటపెట్టడం జరిగిందని వారు తెలిపారు. సోషల్ మీడియా కన్వీనర్లు చేపట్టిన 'బిజెపి వంద అబద్దాలు' క్యాంపెయిన్‌ను మంత్రి కెటిఆర్ అభినందించారు. అబద్దాల పునాదుల మీద రాజకీయం చేస్తున్న బిజెపి అసలు రూపాన్ని ప్రజల ముందు ఉంచారని కొనియాడారు. బుక్‌లెట్, సిడి ద్వారా బిజెపి తప్పులను, వైఫల్యాలను మరింతగా ప్రజల్లోకి తీసుకెళ్లి వాస్తవాలను గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు తెలిసేలా చేయాలని వారికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వివేకానంద్‌గౌడ్, ఎంపి బిబి పాటిల్ తదితరులు పాల్గొన్నారు.

అళహ సింగరాచార్యుల మృతికి కెటిఆర్ సంతాపం

ప్రముఖ సంపాదకులు కె.శ్రీనివాస్ తండ్రి, ప్రముఖ తెలుగు సంస్కృత భాషా పండితులు కండ్లకుంట అళహ సింగరాచార్యుల మృతి పట్ల మంత్రి కెటిఆర్ సంతాపం ప్రకటించారు. అళహ సింగరాచార్యుల కుమారుడు ఎడిటర్ కె.శ్రీనివాస్ కుటుంబ సభ్యులకు కెటిఆర్ తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

ప్రయివేటు పాలకు పట్టం

- పడిపోయిన ప్రభుత్వరంగ డెయిరీల అమ్మకాలు
- ఆ డెయిరీలకే గురుకులాల కాంట్రాక్టు
- పుట్టగొడుగుల్లా ప్రయివేటు మిల్క్ సెంటర్లు
- పట్టించుకోని అధికార యంత్రాంగం
- పెద్దగా కన్పించని విజయ, నార్మూల్



ప్రజాశక్తి - హైదరాబాద్

ప్రయివేటు మిల్క్ సెంటర్ల పాల దందా మూడు పువ్వులు.. ఆరు కాయలుగా సాగుతోంది. అధికారులు సైతం ప్రభుత్వ రంగం మిల్క్ డెయిరీలను పక్కన పెట్టారు. ప్రయివేటు మిల్క్ డెయిరీలను ప్రోత్సహిస్తూ గురుకుల విద్యాసంస్థలకు ఆ పాలనే సరఫరా చేస్తున్నారు. అధికారులు ప్రయివేటు డెయిరీలకు గురుకుల విద్యాసంస్థలకు కాంట్రాక్టు అప్పగించారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో పాల బిజినెస్ ఎవర్ గ్రీన్‌గా మారిపోయింది. వినియోగిస్తున్న పాలకు చెందిన కొన్ని మిల్క్ డెయిరీలు ఎక్కడ ఉన్నాయో తెలియదు. కానీ ఎక్కడ చూసినా ఆ కంపెనీల పాల ప్యాకెట్లే కనిపిస్తున్నాయి. ప్రభుత్వరంగ డెయిరీలైన విజయ, నార్మూల్ పాల ప్యాకెట్లు కొనుగోలు చేద్దామన్నా కనిపించడం లేదని వినియోగదారులు అంటున్నారు.

15 లక్షల లీటర్లకు పైగా పాలు..

ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా 15 లక్షల లీటర్ల పాలు ఉత్పత్తి అవుతున్నాయి. ఇవీకాకుండా అదనంగా బయటి నుంచి వచ్చిన లక్షలాది పాల ప్యాకెట్లు అమ్ముడుపోతున్నాయి. వాస్తవంగా చూస్తే.. పాల వ్యాపారంలో ప్రయివేటు డెయిరీలది 90 శాతం వాటా ఉంటే.. విజయ, నార్మూల్ (మదర్) డెయిరీల వాటా 10 శాతానికి మించడం లేదు. మదర్ డెయిరీ పాల ప్యాకెట్లు కొన్నిచోట్ల కనిపిస్తున్నా.. విజయ డెయిరీ పాల ప్యాకెట్లు మాత్రం మచ్చుకైనా కానరావడం లేదు.

గురుకులాలకు ప్రయివేటే..

గురుకుల పాఠశాలల్లో విద్యార్థులకు రోజూ అందించాల్సిన పాల కోసం టెండర్లను సైతం అధికార యంత్రాంగం ప్రయివేటు మిల్క్ డెయిరీలకు కట్టబెట్టడం గమనార్హం. క్వాలిటీ విషయంలో టాప్‌లో ఉండే ప్రభుత్వరంగ డెయిరీలను కాదని.. అసలు ఎక్కడి నుంచి పాలను సేకరిస్తున్నారో తెలియని.. ప్రయివేటు మిల్క్ డెయిరీలకు అధికారులు టెండర్లు ఓకే చేయడం వివాదాస్పదమవుతోంది. లీటరు పాలకు రూ.రెండు తగ్గుతుందనే సాకుతో ఇటీవల గురుకుల పాల టెండర్లను కట్టబెట్టినట్టు తెలుస్తోంది.

పుట్టగొడుగుల్లా ప్రయివేటు మిల్క్ సెంటర్లు..

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ప్రయివేటు మిల్క్ డెయిరీలు పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చాయి. కనీస ప్రమాణాలు పాటించడం సంగతి పక్కనపెడితే.. అవి నిజంగా పాలేనా..? లేక కెమికల్స్‌తో తయారు చేసి ప్యాకెట్లలో నింపి సరఫరా చేస్తున్నారా...? అన్నది తెలియదు. యూరియా, సర్ఫ్ తదితర కెమికల్స్‌తో పాలను తయారు చేసి ప్యాకెట్ల రూపంలో విక్రయాలు జరిపిన ఘటనలు బహిర్గతమైన దాఖలాలు లేకపోలేదు. నల్లగొండ, సూర్యాపేట, యాదాద్రిభువనగిరి, చౌటుప్పల్, యాదగిరిగుట్ట, నకిరేకల్, తిరుమలగిరి, మిర్యాలగూడ, హాలియా, కోదాడ పట్టణాల్లో ప్రయివేటు మిల్క్ డెయిరీలదే హవా.

ప్రభుత్వ రంగ డెయిరీల బలోపేతమేదీ..?

పాడి రైతాంగాన్ని ప్రోత్సహించడంతో పాటు వారిని ఆర్థికంగా బలోపేతం చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వరంగ డెయిరీలు నడుసున్నాయి. ప్రధానంగా ఉమ్మడి జిల్లాలో మదర్ డెయిరీ, విజయ డెయిరీ పాలకు మంచి డిమాండ్ ఉంది. హాట్ కేకుల్లా విజయ డెయిరీ పాలు, పాల ఉత్పత్తుల సేల్స్ ఉంటాయి. అయితే, కొంతకాలంగా ఉమ్మడి జిల్లాలో విజయ, నార్మూల్ డెయిరీ ఉత్పత్తులు కన్పించడం లేదు. సదరు డెయిరీలు రోజురోజూకీ ఆర్థికంగా చితికిపోతున్నాయి. వీటిని బలోపేతం చేయాలంటే ఏకైక మార్గం.. సేల్స్ పెంచడమే. ప్రయివేటు డెయిరీల పాలు, ఉత్పత్తుల వినియోగం రోజు రోజుకూ పెరుగుతూ లాభాలు గడిస్తుంటే.. ప్రభుత్వ రంగ డెయిరీ ఉత్పత్తుల విషయంలో అధికారులు ఏం చేస్తున్నారని ప్రజల నుంచి ప్రశ్నలు వస్తున్నాయి.